ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 18 అక్టోబరు 2024



అగ్నిమాపక శాఖ సిబ్బందికి నైపుణ్య శిక్షణ

- నాలుగు జిల్లాల నుంచి 35 మంది రాక

భద్రాచలం అక్టోబరు, 17 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో రెండు రోజుల పాటు నిర్వహించే అగ్నిమాపక శాఖ నైపుణ్య శిక్షణ బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల నుంచి హాజరైన 35 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. కొత్తగా కొనుగోలు చేసిన రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్ పై శిక్షణ, అత్యవసర సమయంలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిక్షణను జిల్లా అగ్నిమాపక అధికారి క్రాంతి పర్యవేక్షించారు. ముంబైకి చెందిన శ్రీలలిత కంపెనీ ప్రతినిధి మనోజ్ సావన్ ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ విరమణ

- నేటి నుంచి తరగతులు షురూ

ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ కళాశాలల బంద్‌ను విరమిస్తున్నట్టు రాష్ట్ర డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ప్రకటించాయి. గురువారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలతో నిర్వహించిన చర్చలు సఫలమైనట్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల్లో తరగతులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన టోకెన్‌లకు సంబంధించిన బకాయిలను వారంలో కళాశాలలకు వచ్చేవిధంగా కృషిచేస్తామని, ప్రస్తుత సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై త్వరలో ముఖ్యమంత్రిలో సమావేశం నిర్వహించి నిర్ణయం తీకుంటామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

నిధులు లేక నీరసం

- పీహెచ్‌సీలకు రెండేళ్లుగా రాని హెచ్‌డీఎఫ్ నిధులు
- కుంటుపడుతున్న అభివృద్ధి పనులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు

6

- అడ్రస్ లేని ప్రత్యేక కమిటీల సమావేశాలు

అండర్‌పాస్ హైలెవల్ వంతెన ఏదీ!?

- కుప్పకూలి పది నెలలైనా జాడలేని ఎన్‌హెచ్ అధికారులు
- జాతీయ రహదారి పనుల్లో నాణ్యతాలోపాలపై విస్మయం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


7

ఆర్టీసీకి దసరా ధమాకా

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.25.94 కోట్ల ఆదాయం
- అత్యధికంగా ఖమ్మం డిపోకు రూ.6.27 కోట్లు
- సిబ్బందిని అభినందించిన ఆర్ఎం సరిరామ్

7

ఇన్‌చార్జి మంత్రి ఎక్కడ!?



- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై జాడలేని సమీక్షలు
- పది నెలలుగా ఒక్కసారి కూడా జరగని సమావేశం
- ఉమ్మడి జిల్లాలో అపరిష్కృతంగా అనేక సమస్యలు
- శాఖల మధ్య లోపించిన సమన్వయం
- తమ శాఖలకే పరిమితమవుతున్న జిల్లా మంత్రులు

ఖమ్మం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా అనేక సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. తేలని ఇసుక పాలసీ, సీతారామ, నేషనల్ హైవేల భూసేకరణ సమస్యలు, మిషన్‌భగీరథ ద్వారా ఇంకా కొన్ని గ్రామాలకు అందని తాగునీరు.. ఇలా ఉమ్మడి జిల్లాలో అనేక మమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై అధికారులకు మార్గదర్శకాలిచ్చేందుకు ప్రభుత్వం నియమించిన ఇన్‌చార్జి మంత్రి సమీక్షలు నిర్వహించకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నియమితులైన విషయం విదితమే. ఇన్‌చార్జి మంత్రి హోదాలో ఆయన గతేడాది డిసెంబరు 26న తొలిసారి ఖమ్మంలో ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు రావడంతో మళ్లీ సమీక్షా సమావేశం జరగలేదు. గత ఏడాది కాలంలో ఇరు జిల్లాల కలెక్టర్లు, అధికారులు జిల్లాస్థాయి నుంచి మండలస్థాయి వరకు మారారు. మొదటి సమావేశం జరిగి పది నెలలుకావస్తున్నా మళ్లీ రెండోసారి ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహించలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు మాత్రమే ఇన్‌చార్జి మంత్రి హాజరయ్యారు.

తమ శాఖలకే పరిమితం

జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురు మంత్రులను సమన్వయం చేసుకుని ఇన్‌చార్జి మంత్రి ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలోని ముగ్గురు మంత్రులు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం, వారి సొంతశాఖలకు సంబంధించి సమీక్షలు చేయడం వంటి పనులు చేస్తున్నారు. కానీ జిల్లాలో ఉమ్మడిగా అధికారులకు సలహాలు, సూచనలు మాత్రం అందడంలేదు. ముగ్గురు మంత్రులు కూడా కలిసి జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించడం లేదు. ఎవరికి వారే తమ నియోజకవర్గాలకు పరిమితవుతూ అప్పుడప్పుడు కలెక్టరేట్‌కు వచ్చి తమ సొంత శాఖలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. కానీ జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి అభివృద్ధి, సంక్షేమ పథకాల పనితీరుపై మంత్రులు ఉమ్మడిగా సమీక్షలు చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఉమ్మడి సమావేశాలు నిర్వహిస్తేనే అధికారులకు సరైన మార్గదర్శకాలు అందే అవకాశం ఉంటుంది.

పరిష్కరించాల్సిన సమలు ఎన్నో..

జిల్లాలో అనేక సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు సీజన్ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో ఇసుక పాలసీ, సీతారామ సాగునీటి ప్రాజెక్టు పనుల పరిస్థితి, భూసేకరణ సమస్య అలాగే నేషనల్ హైవేల నిర్మాణం, భూసేకరణలో ఇబ్బందులు, మిషన్‌భగీరథ ద్వారా ఇంకా కొన్ని గ్రామాలకు తాగునీరు చేరకపోవడం, వర్షాలు, వరదల కారణంగా ఉమ్మడిజిల్లాలో ప్రభుత్వ ఆస్తులకు భారీగా నష్టం జరగడం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, ఆరుగ్యారంటీల అమలు, ప్రజలనుంచి వచ్చే వినతులకు పరిష్కారాలు, భూసమస్యలతో పాటు ఇంకా అనేక సమస్యలతో జిల్లా ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగానికి సరైన మార్గదర్శకాలిచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంది. ఇందుకు ఇన్‌చార్జి మంత్రి ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలుతీరు, జిల్లాకు రావాల్సిన నిధులు, కేటాయింపులుపై చర్చించాల్సి ఉంది. ఇప్పటికే పల్లెల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎంపీపీలు, జడ్పీటీసీలు ఎవరూ లేరు. దాంతో స్థానిక సంస్థల సమీక్షలు కూడా జరగడం లేదు. ఇప్పుడు అన్ని సమస్యల పరిష్కారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతోనే ముడిపడి ఉంది. ఇప్పటికైనా జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి ఉమ్మడిసమీక్ష నిర్వహించి మార్గదర్శకాలిస్తేనే ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెరిగి పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంటుంది.



రామాలయంలో పుష్పాలు, ఫలాలతో గిరిజనులు



ఏపీలోని కూనవరం గ్రామంలో గోదావరి-శబరి సంగమం వద్ద శబరి మాతకు అభిషేకం

రామయ్యకు గిరిజనుల నీరాజనం

- సంప్రదాయబద్ధంగా శబరి స్మృతి యాత్ర
- వినాయకపురంలో ఘనంగా కల్యాణమహోత్సవం

భద్రాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పూర్వ కాలంలో రామ లక్ష్మణులకు సపర్యలు చేసిన శబరి స్మృత్యర్థం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులు 12వ సారి భద్రాచలంలో నిర్వహించిన శబరి స్మృతి యాత్రతో ఆధ్యాత్మిక భావన వెల్లివిరిసింది. యాత్రలో భాగంగా తొలుత రామ లక్ష్మణులు, శబరి చిత్ర పటాన్ని పట్టుకోగా అగ్ర భాగాన సంప్రదాయ బద్ధంగా మేళతాళాలు, కోలాటాలు నిర్వహించారు. రామాలయం చుట్టూ గిరిప్రదిక్షణ నిర్వహించి ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా స్వామివారి నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కాగా, ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కూనవరంలో గోదావరి-శబరి సంగమం వద్ద ఆలయ వేద పండితులు చిట్టి హనుమత్‌శాస్త్రి, అర్చకులు కిరణ్ కుమారా చార్యులు శబరిమాతకు పంచామృతాభిషేకం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, నెయ్యి తదితర ద్రవ్యాలతో శబరిమాతకు అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరోవైపు వాల్మీకి జయంతిని పురస్కరించుకొని భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరి స్మృతి యాత్రను నిర్వహిస్తున్న నేపథ్యంలో వాల్మీకి జయంతి కూడా రావడంతో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

వినాయకపురంలో కళ్యాణ మహోత్సవం

అశ్వారావుపేట మండలంలో గిరిజన ప్రాంతమైన వినాయకపురంలో చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం వద్ద గురువారం శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 8గంటల గ్రామంలో స్మృతిరథం శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం కొమ్ము నృత్యాల నడుమ గ్రామంలో శోభాయాత్ర చేశారు. అనంతరం భద్రాచలం ఆలయ వేదపండితులు, వైదిక పెద్దలు సీతారాముల వారి కళ్యాణాన్ని నిర్వహించారు. వినాయకపురంతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.



గిరి ప్రదక్షిణ

కొమరం భీమ్ పోరాటం మరువలేనిది

- ఐటీడీఏ పీవో బి. రాహుల్



నివాళులర్పిస్తున్న ప్రాజెక్టు అధికారి రాహుల్

భద్రాచలం అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి): మారుమూల ఆదివాసి గిరిజన గూడెలలో నివసిస్తున్న గిరిజనుల హక్కులు, జల్ జంగిల్ జమీన్ కోసం నిజాం ప్రభుత్వంతో పోరాట వీరుడు అమరజీవి కొమరం భీమ్ చేసిన పోరాటం మరువలేనిదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశం మందిరంలో అమరవీరుడు కొమరం భీమ్ 84వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ మాదే అనే నినాదంతో ఉద్యమించాడని, ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీ దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ వీరోచితంగా పోరాడి ప్రాణాలు అర్పించారన్నారు. గిరిజనులను ఒక్క తాటిపై నడిపించిన ఘనత కొమరం భీమ్ కే దక్కిందన్నారు. ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే గిరిజనులకు మన వంతు సహకారం అందించి వారికి చెందవలసిన సంక్షేమ పథకాలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఏవో రాంబాబు, ఆర్సీవో గురుకులం నాగార్జున రావు, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, అగ్రికల్చర్ అధికారి భాస్కర్, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, పీవీటీసీ అధికారి మనిధర్, రమణయ్య, జీసీడీవో అలివేలు మంగతాయారు, డీఎస్‌వో ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో వాల్మీకికి ఐటీడీవో బి. రాహుల్ ఘనంగా నివాళులర్పించారు. గురువారం మహాకవి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

స్ఫూర్తి ప్రదాత శివాజీ

- హిందూ ఆలయాలపై దాడులు సరికాదు
- ఆ ఘటనల వెనుక ఎవరున్నా వదిలిపెట్టొద్దు
- బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- నగరంలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

ఖమ్మం బైపాస్‌రోడ్డు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం అని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొవాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నగరంలోని పాత ఖనాపురం 7వడివిజన్‌లో శివాజీ సంకల్ప యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం కోసం శివాజీ నిరంతరం తపించేవారని, ఆయన వీరత్వం, భయానికి తావు లేని కార్యచరణ ప్రజలలో ఎప్పటికి గుర్తుండిపోతాయని అన్నారు. హైదరాబాద్‌లో కొన్ని శక్తులు తయారయ్యి, సైకోలుగా మారి హిందువుల దేవాలయాలపై దాడులు చేస్తున్నార న్నారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో దాడి జరిగిందని, ఇది ఒక పథకం ప్రకారంగానే జరిగిందన్నారు. ఇది హిందువుల ఆత్మగౌరవం మీద దెబ్బతీసేవిధంగా ఉన్నదని, దీని వెనుక ఎవరు ఉన్న ప్రభుత్వం విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో శివాజి విగ్రహం

(మిగతా 6వ పేజీలో)

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

- జ్యోతి ప్రజ్వలన చేసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణం రచించి ప్రపంచానికి తెలియచేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అంటూ గుర్తు చేశారు. ప్రపంచం ఉన్నంత వరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందని, ఇతిహాసాల్లో మొదటిది రామాయణం, పెద్దది మహాభారతం అని అన్నారు. అలాంటి రామాయణాన్ని రచించినది ఒక బోయకులానికి చెందిన చోరుడు అయిన వాల్మీకి, ఆయన ఇచ్చిన స్ఫూర్తితో అనేకమంది రచయితలుగా, కవులుగా మారారని అన్నారు. ఇతిహాసాల్లోని సారాంశాలను ఈ తరం పిల్లలకు అర్థమయ్యే విధంగా తెలియచెప్పే బాధ్యత మనందరి పై ఉందన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఇలాంటి గొప్ప వారి చరిత్ర గురించి తెలుసుకోవడం నేటి తరాలకు చాలా అవసరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి ఇందిరా, కలెక్టరేట్ పరిపాలన అధికారి రమాదేవి, బీసీ సంఘ నాయకులు మురికి వెంకన్న, బోగా నందకిషోర్, ఉలవల రాములు, గట్టేశం, కోడుమూరు సత్యనారాయణ, గుర్రం శ్రీనివాసరావు, చల్లా శివ, చెప్పా శ్రీనివాస్, చెప్పా వెంకటేశ్వరరావు, గొలుసు శ్రీనివాస్‌రావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రధాన కార్యాలయంలో..

సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్‌ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాలు వద్ద మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి డైరెక్టర్ (ఈఅండ్ఎం ఆపరేషన్స్) డి. సత్యనారాయణరావు, జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్‌ఆర్‌సీ పి. సామ్యూల్ సుధాకర్ పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సీఎంవోఏఐ అధ్యక్షుడు ఎం. విజయ భాస్కర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ లైజనింగ్ ఆఫీసర్ హరిశంకర్, జీఎం (సీపీపీ) మనోహర్, జీఎం (హెచ్‌ఆర్‌డీ) వి. కృష్ణయ్య, ఎజీఎం (ఈఅండ్ఎం) యాజీ షైన్స్ వై. రఘురామిరెడ్డి, వివిధ శాఖాధికారులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వణికిస్తున్న పోస్ట్ వైరల్ ఫీవర్స్

- కాళ్లవాపులు, మణికట్టు, ఒళ్లునొప్పులు
- వారంనుంచి ఆరు నెలల వరకు ఇబ్బందులు..
- పినపాక ఏజెన్సీలో విజృంభిస్తున్న జ్వరాలు



మణుగూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితుడు

మణుగూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పినపాక ఏజెన్సీ ప్రాంతంలో పోస్ట్ వైరల్ ఫీవర్స్ ప్రజలను వణికిస్తున్నాయి. మణుగూరు పినపాక, అశ్వాపురం, కరకగూడెం తదితర మండలాల్లో కొత్తగా వస్తున్న జ్వరాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాళ్లు వాచిపోయి నడవడమే కష్టంగా మారుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి జ్వరాలన వైద్యులు పోస్ట్ వైరల్ ఫీవర్స్ అంటున్నారు. భద్రాద్రి జిల్లాలో ఇప్పటికే పలుసార్లు వైరల్ ఫీవర్లు, సీజనల్ వ్యాదులపై గ్రామాల్లో ర్యాపిడ్ సర్వేలు నిర్వహించిన వైద్యాధికారులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించారు. అయితే ఈ క్రమంలోనే జ్వరం వచ్చిన కొందరిలో పోస్టు వైరల్ ఫీవర్ అనే లక్షణాలు ఉంటున్నాయని, వీటి వల్లనే ఒళ్లు నొప్పులు, కాళ్ల వాపులు ఉంటున్నాయని చెబుతున్నారు. సుమారు పదేళ్ల క్రితం చికెన్‌గున్యాతో ఇబ్బందిపడ్డ ఏజెన్సీ ప్రజలు ఇప్పుడు పోస్ట్ వైరల్ జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పారిశుధ్య సమస్యలు.. దోమల వ్యాప్తే కారణం..


ఏజెన్సీ గ్రామాల్లో అపరిశుభ్ర వాతారణం, పారిశుధ్యం సమస్యలే జ్వర విజృంభణకు కారణమని వైద్యులు చెబుతున్నారు. పరిసరాల్లో అపరిశుభ్రత పెరిగిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రతలు తీసుకోక పోవడంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.

లక్షణాలు ఇవే..

జ్వరంతో ప్రారంభమై ఒళ్లు నొప్పులు, కాళ్ల నొప్పులు, తలనొప్పి, నీరసించి బలహీనమవ్వడం

(మిగతా 8వ పేజీలో)

ఆయన వృత్తిరీత్యా ఆర్టీసీలో ఉద్యోగి. కాని చిన్ననాటి నుంచి రంగస్థలమంటే ప్రాణం,ఊపిరి. దీంతో చిన్ననాటి నుంచి నాటకాల్లో నటించడమే కాదు అనేక కళా వేదికలపై బంజార నృత్యాన్ని చేసి అశేష ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అంతేకాదు గత 23 ఏళ్లుగా ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలో పుర ప్రముఖులు, సహచర ఉద్యోగులు, ఇతర కళాకారుల సహకారంతో నిరాటంకంగా భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో సాంస్కృతిక సంబురాలు నిర్వహిస్తున్నారు. నటుడిగా ఎన్నో ప్రశంసలు, అవార్డులు అందుకున్న అల్లం నాగేశ్వర రావు భద్రాద్రి కళాభారతి వ్యవస్థాపక కార్యదర్శిగా, భద్రాచలం ఆర్టీసీ స్టేషన్ మేనేజరుగా ప్రస్తుతం కొనసాగుతున్నారు.



రంగస్థలమే ఆయనకు ఊపిరి

- 44 ఏళ్లుగా నాటకరంగంలో రాణిస్తున్న అల్లం నాగేశ్వరరావు
- నటుడిగానే కాదు, నృత్యకారుడిగా కూడా ప్రతిభ
- భద్రాద్రి కళాభారతి సంస్థ ద్వారా కళాసేవ



అప్పటి ఆర్టీసీ ఎండీ ప్రసాదరావు నుంచి అవార్డు అందుకుంటున్న అల్లం

భద్రాచలం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం మండలం పర్ణశాల గ్రామానికి చెందిన అల్లం నాగేశ్వర రావు తన సోదరుడు అల్లం లక్ష్మీపతిరావు శ్రీ సీతారామ నాట్యకళామండలి రంగస్థల నటుడు కావడంతో తను వేసే నాటికలు చూసి నేర్చుకున్నారు. ఏడో తరగతి నుంచి ఆయన నాటకాల్లోని డైలాగులను గుర్తు పెట్టుకొని ఆనాటి సహచరులతో కలిసి వీధి దీపాల కింద నాటకాలను వేస్తూ ఈ సమయంలో బూడిద ముఖానికి రాసుకొని, మసిబొగ్గుతో మీసాలను గీసుకొని తమలో ఉన్న కళాతృష్ణను ప్రదర్శించే వారు. ఈ క్రమంలో భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981లో ఇంటర్ బైపీసీలో చేరి కళాశాలలో జరిగిన నాటిక పోటీల్లో ఏక్‌దిన్‌కా సుల్తాన్ నాటికను ప్రదర్శించారు. అందులో మీసాల వెంకటరత్నం పాత్రను పోషించిన ఆయనకు ఉత్తమ నటుడిగా అవార్డు వచ్చింది. సారపాక ఐటీసీ కాలనీలో ఉంటున్న క్రమంలో స్టూడెంట్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అప్పటి స్థానికుల సహకారంతో కేటు-డూప్లికేటు నాటికను ప్రదర్శించగా అది ఎంతగానో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సమయంలో తన నటనా ప్రతిభను గుర్తించిన ఆయన సోదరుడు తమతో నాటక పోటీల్లో నటించేందుకు అల్లం నాగేశ్వరరావును ప్రోత్సహించారు. పూలరండుగు, దేవుడు నిద్రలే, ప్రజారాజ్యం, రంగులరాట్నం ఇలా ఎన్నో నాటకాల్లో ఆయన నటించారు. ఈ క్రమంలో ఆర్టీసీలో 1987లో కండక్టర్‌గా ఉద్యోగం రావడంతో కొత్తగూడెంలో తొలి పోస్టింగ్‌లో చేరారు. 1994లో నర్సంపేట డిపోకు బదిలీ అయ్యారు. అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులతో కలిసి సాధన కళాసమితి సంస్థను స్థాపించి దాని ఆధ్వర్యంలో నాటకాలు వేసేవారు. వశీకరణం నాటిక ఎంతో పేరు తెచ్చింది. విశాఖపట్నంలో పుట్టలో వేలుపెడితే కుట్టనా నాటిక ప్రదర్శనకు ఉత్తమ ప్రొడక్షన్, ఉత్తమ నాటిక, ఉత్తమ దర్శకుడిగా అవార్డు వచ్చింది. అలాగే హింసద్వని, తల్లి క్షమించు , మనస్సులు కలిస్తే, నీతోనే మొదలెట్టు నాటికలు సైతం అల్లంకు ఎంతో పేరు తెచ్చాయి.

బంజారా నృత్యంలో టాప్

నర్సంపేటలో ఉన్నప్పుడు ఆ ప్రాంతంలో బంజారా నృత్యాన్ని నేర్చుకున్న అల్లం నాగేశ్వరరావు అనంతరం రాష్ట్ర స్థాయి నృత్యపోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆ పోటీల్లో ఆయన ప్రథమస్థానం సాధించడం విశేషం. అదే రీతిలో బంజారా నృత్యంను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెల్లూరు, తిరుపతి, అశ్వాపురం హెవివాటర్‌ప్లాంట్ కాలనీలో వారి ఆహ్వానం మేరకు బంజారా నృత్యం ప్రదర్శించి మన్ననలు పొందారు.

భద్రాద్రి కళాభారతికి శీకారం

2001లో భద్రాచలం ఆర్టీసీ డిపోకు అల్లం నాగేశ్వరరావు బదిలీపై వచ్చారు. ఈ సమయంలో భద్రాద్రిలో సాంస్కృతిక నాటక సంబురాలను నిర్వహించాలని తలచి ఆనాడు డిపోలో తనతో పని చేస్తున్న మిత్రులు, పట్టణంలో ఔత్సాహికులైన కళాకారులతో కలిసి భద్రాద్రి కళాభారతికి శ్రీకారం చుట్టారు. అప్పుడు ఆయన దానికి వ్యవస్థాపక కార్యదర్శిగా పని చేస్తున్నారు. 2001 అక్టోబరు 31న భద్రాద్రి కళాభారతికి శ్రీకారం చుట్టగా ఆ సమయంలో వేసిన వశీకరణం నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. యేటా రాష్ట్రస్థాయి నాటకోత్సవాలను నిరాటంకంగా నిర్వహిస్తూనే ఉన్నారు. భద్రాద్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికపై భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో సుమారు 110 నాటికలను ప్రదర్శించారు. నాటికలను ప్రదర్శించడమే కాకుండా భద్రాద్రి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఔత్సాహిక యువ కళాకారులను ప్రోత్సహించేందుకు సంప్రదాయ నృత్యాలు సైతం ప్రదర్శిస్తున్నారు.

శేషార్థం నాటిక ఇప్పటి వరకు 25సార్లు ప్రదర్శించారు. ఇందులో పాత్రదారుడిగా, దర్శకుడిగా అల్లం నాగేశ్వరరావు ఉన్నారు. ఈ నాటికను దేశంలోని బిలాయ్, కోల్‌కతా, ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం, భద్రాచలం తదితర చోట్ల ప్రదర్శించడం జరిగింది. ప్రదర్శించిన ప్రతిసారి ఉత్తమ నటుడు దర్శకుడు అవార్డులను ఆయన 25 సార్లు తీసుకోవడం విశేషం.

ఇంటిగ్రేటేడ్ పాఠశాల చుట్టూ రోడ్లకు నిధులు

- 19.70 కోట్ల మంజూరుతో అభివృద్ధి విజన్‌ను చాటిన భట్టి



బోనకల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బోనకల్ మండలం లక్ష్మీపురం పరిధిలో గల 30 ఎకరాల భూమిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసిన 6 రోజుల వ్యవధిలోనే పాఠశాల చుట్టూ వలయాకారపు రోడ్ల నిర్మాణాలకు 19.70 కోట్ల నిధులను మంజూరు చేసి తన అభివృద్ధి విజన్‌ను చాటారు. పాఠశాలకు చుట్టు పక్కల 10.80 కిలో మీటర్ల పరిదిలో అన్ని వైపుల నుంచి చేరుకునేందుకు వీలుగా రోడ్ల నిర్మాణాలను చేపట్టనున్నారు. గార్లపాడు నుంచి రామాపురం పీఆర్ రోడ్డు నుంచి పాతర్లపాడు, బోనకల్ బ్రాంచ్ కెనాల్ మీదుగా 3 కి.మీ.కు 6.70 కోట్లు మంజూరయ్యాయి. గోవిందాపురం(ఎల్) నుంచి పాతర్లపాడు వయా బీబీసీ కెనాల్ 2.20 కి.మీ. రోడ్డుకు 4.60 కోట్లు, గోవిందాపురం నుంచి ఇంటిగ్రేటెడ్ పాఠశాల వరకు గల 1.10 కి.మీ.కు 2.60 కోట్లు, గోవిందాపురం, పాతర్లపాడు రోడ్డు నుంచి ఇంటిగ్రేటెడ్ పాఠశాల వరకు గల 1కి.మీ. రోడ్డుకు 2.30కోట్లు, గోవిందాపురం నుంచి వల్లాపురం వరకు గల 3.50 కి.మీ. రోడ్డుకు 3.40 కోట్లు మంజూరయ్యాయి. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, సొసైటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరావు, చేబ్రోలు వెంకటేశ్వరావు, మోదుగు సుదీర్‌బాబు, నల్లమోతు సత్యనారాయణలు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కూరగాయలు కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	56
వంకాయ	44
గుత్తి వంకాయ	50
బీరకాయ	54
పచ్చిమిర్చి	54
కాకరకాయ	48
బెండకాయ	38
పొట్లకాయ	60
దోసకాయ	54-60
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	36
దొండ	26-30
సొరకాయ	36
క్యారెట్	64
క్యాప్సికం	88
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

డీఈవోను తొలగించాలని ఆందోళన

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 17: టీఎస్ డీ ఎస్సీ - 24 ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌లో అక్రమాలకు పాల్పడిన డీఈవో, కార్యాలయ ఏపీవోను విధుల నుంచి తొలగించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. గురువారం డీఈవో కార్యాలయం ముందు అభ్యర్థితో కలిసి యూటీఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఉపాధ్యాయ పోస్టింగ్ విషయంలో అధికారుల తీరుపై యూటీఎఫ్ నాయకులకు, అధికారులకు వివాదం తలెత్తినా పోలీసుల జోక్యంతో తాత్కలికంగా సద్దుమణిగింది. ఉపాధ్యాయ పోస్టింగ్‌లో జరిగిన అవకతవకలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నవంబరు 2వ వారంలో జిల్లా ఇన్‌స్పైర్ పోటీలు

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఇన్స్పైర్ మానక్ పోటీలను జూనియర్, సీనియర్ విభాగాలలో నవంబరు 2వ వారంలో నిర్వహిస్తామని డీఈవో ఎం వెంకటేశ్వరచారి తెలిపారు. 2024 సంవత్సర సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ (శాస్త్ర సాంకేతిక రంగం - భవిష్యత్ సుస్థిర అభివృద్ధి) అనే ప్రధాన అంశంపై ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీలలో విద్యార్థులు ఆహారం, ఆరోగ్యం, మ్యాథమెటికల్ మోడల్ కాంప్యుటేషన్ థింకింగ్, రవాణా కమ్యూనికేషన్, వ్యర్థ పదార్థాల నిర్వహణ, సహజ వ్యవసాయం, వనురుల నిర్వహణ, విపత్తు నిర్వహణలపై ఎగ్జిబిట్ నిర్వహించాలన్నారు. జూనియర్ స్థాయిలో 6నుంచి 8 తరగతులు, సీనియర్ 9,10 తరగతులకు చెందిన విద్యార్థులకు నిర్వహించే పోటీలకు ప్రతి పాఠశాల నుంచి కనీసం 5ప్రాజెక్ట్‌లు రూపొందించాలన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ రెసిడెన్షియల్, మైనార్టీ, ఆశ్రమ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్దం చేసుకోవాలన్నారు.

86 ఇన్‌స్పైర్ అవార్డుల ఎంపిక..

జిల్లాలో 2023 సంవత్సరంలో ఇన్స్పైర్ మానక్ కింద 86 ప్రాజెక్ట్‌లు ఎంపిక అయ్యాయని డీఈవో వెంకటేశ్వరచారి అన్నారు. ఎంపికైన ఒక్కో ప్రాజెక్ట్‌కు రూ.10వేల మంజూరు చేశామన్నారు. వీరికి నవంబరు 2వ వారంలో జిల్లా పోటీలు నిర్వహిస్తామన్నారు.

కాంట్రాక్టు ఏఈవోలపై

పనిఒత్తిడి తగ్గించండి



వినతి పత్రం సమర్పిస్తున్న కాంట్రాక్ట్ ఏఈవోలు

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అగ్రిమిషన్‌లో భాగంగా భూమిని సాగు చేస్తున్న రైతుల పంటల వివరాలను యాప్‌లో నమోదుచేయాలని ఏఈవోలపై వ్యవసాయశాఖ అధికారుల ఒత్తిడి నిరసిస్తూ ఏఈవోల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబురావుకు జిల్లాలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 9మంది ఏఈవోలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డిజిటల్ పంట సర్వే నిర్వహిచడంలో శారీరక శ్రమ, ప్రాణ నష్టం, ఆర్థిక నష్టాలను తెలియజేస్తూ ఆరకొర సిబ్బందితో పంటల వివరాలను హడవుడిగా చేయించడం వల్ల తప్పుల తడకగా ఉండే అవకాశం ఉందన్నారు. మారుమూల ప్రాంతాల్లో కొండలు, గుట్టలు, ఫారెస్ట్ భూములలో పంట సర్వే చేసే క్రమంలో ప్రమాదాల భారిన పడుతున్నారన్నారు. ఏఈవోలకు వ్యక్తిగత ప్రమాద బీమా నగదు సౌకర్యం కల్పించాలని కోరారు. రెగ్యులర్ ఏఈవోలు చేయలేని పనిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించే ఏఈవోలకు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు లభించవని అన్నారు. డిజిటల్ సర్వే చేయని ఏఈవోలను ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నర్సింహరావు, రవీందర్‌రావు, శ్రీనివాస్, అనూష, ప్రవీణ్, అశ్వీత్, గోపికృష్ణ, శరత్, అనిల్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత శివాజీ

(5వ పేజీ తరువాయి)

ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉన్నదని చత్రపతి శివాజీ సంకల్ప యూత్ ను అభినందించారు. కాగా, విగ్రహావిష్కరణ నిమిత్తం ఈటల నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు రాగానే అభిమానులు, పార్టీ కార్యకర్తలు బైక్ రాలీగా వెళ్లి ఘన స్వాగతం పలికారు. తరువాత పాత ఖానాపురం వద్దకు చెరుకొగానే కొలాటలతో మహిళలు బతుకమ్మలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, బీజేపీ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శీలం పాపారావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు, సన్నె ఉదయ్ ప్రతాప్, నంబూరి రామలింగేశ్వరరావు, 7వ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారయన, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, శ్యామ్, రవికుమార్, రుద్రప్రదీప్, కుమిలి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఒకే హాల్లో విధుల నిర్వహణ

నిధులు లేక నీరసం

- పీహెచ్‌సీలకు రెండేళ్లుగా రాని హెచ్‌డీఎఫ్ నిధులు
- కుంటుపడుతున్న అభివృద్ధి పనులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు
- అడ్రస్ లేని ప్రత్యేక కమిటీల సమావేశాలు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు లేక రోగులు, ఆస్పత్రి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే ఆస్పత్రి అభివృద్ధి నిధులు (హెచ్‌డీఎఫ్) సక్రమంగా రాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఆస్పత్రి సామర్థ్యాన్ని బట్టి ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ.1.75 లక్షల వరకు హెచ్‌డీఎఫ్ కింద నిధులను విడుదల చేసేది. కానీ గత రెండేళ్లుగా ఈ నిధులు సక్రమంగా రాకపోవడంతో పీహెచ్ సీల్లో మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి మూడు నెలలకోసారి హెచ్‌డీఎఫ్ సమావేశం ఏర్పాటు చేసుకుని ఆస్పత్రిలో అవసరమైన సదుపాయాలకు కృషి చేయాల్సి ఉన్నప్పటికీ జిల్లాల్లో ఎక్కడా సక్రమంగా అమలు జరగడంలేదు.

దెందుకూరు పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు మొత్తం కలిపి 33 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు 33 మంది ఆశావర్కర్లు పనిచేస్తున్నారు. ప్రతి రోజు 50నుంచి 70 మంది మంది వరకు రోగులు వస్తారు. ప్రస్తుతం ఈ భవనం గతంలో సబ్‌సెంటర్ నిర్వహించిన భవనంలో పీహెచ్‌సీని నిర్వహిస్తున్నారు. 33 మంది సిబ్బందికీ, వచ్చిన రోగులకు కలిపి ఒక్కటే ఒక్క మరుగుదొడ్డి ఉంది. ఇరుకు గదులు, రోగులను పరిశీలించాలంటే కూడా దయనీయమైన పరిస్థితి.. దీనికి ప్రభుత్వం కొత్త భవనాన్ని మంజూరి చేయాల్సి ఉన్నా నిధులు కేటాయించడం లేదు. పోనీ అద్దెకు భవనాన్ని తీసుకోవాలన్నా గ్రామస్థులు సహకరించకపోవడంతో అక్కడి సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు.

జాడేలేని కమిటీలు

హెచ్‌డీఎఫ్ అంటే.. ఆస్పత్రి అభివృద్ధి నిధులు. దీనికి పీహెచ్‌సీ స్థాయిలో ప్రత్యేక కమిటీ ఉంటుంది. ఎంపీపీ ఆ కమిటీకి అధ్యక్షుడిగా ఉంటారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచి, ఆస్పత్రి వైద్యుడు, మహిళాసంఘం ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. వీరు మూడు నెలలకో సారి సమావేశమై ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు తీర్మానాలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌డీఎఫ్ కింద అందించే నిధులను వాటి కోసం ఖర్చు చేయాలి. ప్రస్తుతం నిధులు సక్రమంగా రాకపోతుండడం, మండల పరిషత్, గ్రామపంచాయతీల పాలకవర్గాలు రద్దుకావడంతో ఈ కమిటీ సమావేశాలు జరగడం లేదు. జిల్లాలో 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మరో 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొత్తం 30 వరకు ఉన్నాయి. వీటితో పాటు 224 ఆరోగ్యమందిర్ లున్నాయి. వీటిలో 161 వెల్‌నెస్ సెంటర్లుగా అభివృద్ధి చేశారు. పీహెచ్‌సీలకు ఏటా రూ.1.75 లక్షల వరకు నిధులు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ 2020 వరకే ఈ నిధులు వచ్చాయి. అప్పటి నుంచి నిధులు రాకపోతుండటంతో పీహెచ్‌సీల్లో స్టేషనరీ, కంప్యూటర్ మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, విద్యుత్తు దీపాల ఏర్పాటుతోపాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హెచ్ఎఫ్ కింద వచ్చే డబ్బులు రావడంలో ఆలస్యం జరుగుతోందని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు చెబుతున్నారు. అయినా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వోలు చెబుతున్నారు.

నిధులు నిలిచిపోయిన మాట వాస్తవమే..

మేకల దుర్గ, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గత ఏడాదిన్నరగా హెచ్‌డీఎఫ్ నిధులు ఆగిపోయిన మాట వాస్తవమే. దీనిపై ప్రభుత్వానికి నివేస్తున్నాం. ఇటీవలి వరకు పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు కూడా బడ్జెట్ రాక ఇబ్బందులు పడ్డారు.హెచ్‌డీఎఫ్, జననీ సురక్ష యోజన, నిధులు రాకపోవడంతో పీహెచ్‌సీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చిన్న చిన్న అవసరాలకు కూడా నిధులు లేకపోవడంతో అవి జటిలం అవుతున్నాయి.

ఓసీ పనులపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసే జేకే ఓసీ పనులపై గురు వారం ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలోనే ప్రస్తుత జేకే5 ఓసీ, 21 ఇంక్లైన్‌ను క లుపుతూ ఏర్పడబోయే నూతన జేకేఓసీ ఏర్పాటుకు సం బంధిం చిన 151.85హెక్టర్ల అటవీభూమి వాడకానికి సూత్రప్రాయంగా కేం ద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అనుమతులు ఇచ్చిందని ప్ర కటించారు. తదుపరి ఉత్తర్వుల కొరకు చేయాల్సిన పనులకు సం బంధించి అధికారులకు పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. తమకు కేటాయించిన నూతన ప్రాజెక్టు పనులు ఎటువంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని జీఎం కోరారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ఏజీఎం గిరిధరరావు, ఏరియా ఇంజనీరు నర్సింహరాజు, ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణమోహన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రామాస్వామి, డీజీఎం సివిల్ రవికుమార్, బాలాజీనాయుడు, ధనుంజయరెడ్డి, సంపత్‌నాయక్ పాల్గొన్నారు.

వాడివేడిగా నెల్లిపాక మహాజన సభ



మహాజన సభలో మాట్లాడుతున్న మధుసూధన్‌రెడ్డి

అశ్వాపురం అక్టోబరు 17: గతనెలలో కోరంలేక వాయిదాపడిన మండల పరిధిలోని నెల్లిపాక సహకారసంఘం మహాజనసభను గురువారం మొండికుంటలోని సంఘ కార్యాలయంలో చైర్మన్ తుక్కాని మధుసూధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో వెంకటేష్ 2023-24సంవత్సరానికి సంబంధించిన జమాఖర్చులను సభలో రైతులకు వివరించారు. సంఘంలో మీ హయాంలో అవినీతి జరిగిందటే, మీ హయాంలోనే అవినీతి జరిగిందటూ చైర్మన్, తాజా మాజీ చైర్మన్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అదేవిధంగా గతంలో ఆరోపణలకు గురై సస్పెండ్ అయిన సీఈవో కూడా తనకు సంబంధం లేదంటూ వివరణ ఇచ్చారు. దీంతో సభలో కొద్దిసేపు రసాభాస చోటు చేసుకుంది. దీంతో అఖిలపక్ష నాయకులు కలుగజేసుకుని రైతులకు మేలు జరిగే విధంగా సంఘం కార్యకలాపాలు నిర్వహించాలని, రుణమాఫీ జరిగిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వాలని, అవినీతి, అక్రమాలను అధికారులు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. అనంతరం గతేడాది జమఖర్చులు, ఈ ఏడాది బడ్జెట్, సంఘం ఆధ్వర్యంలో ఉన్న మల్లెలమడుగు గోడౌన్‌ను మినీ ఫంక్షన్‌హల్ గా మార్చాలని మహజన సభలో తీర్మానించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కమటం సురేష్, డైరెక్టర్లు, సుదాకర్‌రెడ్డి, సందీప్, వెంకన్న, నర్సింహులు, మాజీ చైర్మన్‌లు మర్రి మల్లారెడ్డి, కమటం వెంకటేశ్వరరావు, అఖిలపక్ష నాయకులు సర్గం బాలనర్సయ్య, ప్రభాకర్‌రెడ్డి, శీధర్,సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

దుమ్ముగూడెం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరావుపేట, బొజ్జిగుప్ప ఆదివాసీ గ్రామాల్లో ట్రైబల్ మ్యూజియంకు అవసరమైన ఏర్పాట్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం పరిశీలించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మ్యూజియం ఏర్పాటుకు తగిన ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో ఆదివాసీ సంప్రదాయంలో ఉన్న నివాస గృహాలను జిల్లా కలక్టర్ పరిశీ లించారు. పర్యాటకులకు పూర్తి ఆదివాసీ సంప్రదాయంలో స్వాగతం పలకాలని, రాత్రి వేళ బస చేసే వారికి ఆదివాసీల అలవాట్లకు తగ్గట్లుగా ఆతిధ్యం ఇచ్చేలా ఏర్పాట్లు జరగాలన్నారు. పాతకాలం నాటి ఆదివాసీ సంస్కృతిననుసరించి ఇళ్లను నిర్మించాలని, ఇళ్లకు వేసే రంగులు, బస చేసే యాత్రికులకు అందించే ఆహారం పూర్తి గిరిజన సంప్రదాయంలో ఉండాలని సూచించారు. ఆదివాసీలు తయారు చేసిన జొన్నగటక, పచ్చకూర, ఇప్ప పొక్కలను కలెక్టరు ఆస్వాదించారు. లక్ష్మీనగరం ఏకలవ్య పాఠశాలలో సరైన పరిశుభ్రత, శుభ్రమైన తాగునీరు లేక విద్యార్థులు అనారోగ్యానికి లోనవుతున్నారని వారి తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పరిశీలించాలని సూచించారు. భద్రాచలంలో శిశువిహార్‌ను కలెక్టర్ తనిఖీ చేయగా, డబుల్ బెడ్‌రూంలను జేసీ పరిశీలించారు. దుమ్ముగూడెం తహసీల్దార్ అశోక్‌కుమార్‌తోపాటు నాలుగు మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీఎంలు, ట్రైబల్ మ్యూజియం ఇంచార్జి వీరాస్వామి, ఆర్ఐ నర్సింహారావు, స్థానిక కళాకారుడు పిలకా నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ప్రోత్సాహం



భద్రాచలం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని రాజని శివ భార్గవికి ప్రోత్సాహకంగా రూ.50 వేల చెక్కు ను ఐటీడీఏ పీవో బి రాహుల్ గురువారం భద్రాచలంలో అందజేశారు. ఇటీవల నీట్ పరీక్షల్లో ఎస్టీ కోటాలో 567 ర్యాంకు సాధించి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల లోని పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన భార్గవిని పీవో రాహుల్ అభినందించారు.

ధృవీకరణ పత్రాలు ఉండాలి: డీఎస్పీ

ఇల్లెందు టౌన్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహ నాలతోపాటు ఇతర వాహనాలకు ఎలాంటి అనుమతులు లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు డీఎస్పీ చంద్ర భాను హెచ్చరించారు. గురువారం ఇల్లెందు పట్టణ సమీపంలోని రాజీవ్ నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో అనుమ తిపత్రాలు లేని 24 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అనుమతి లేని వాహనాలను సీజ్ చేస్తామని ప్రకటించారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండా లని, గుట్కా, పాన్‌మసాలాలు, గంజాయి అమ్మినా, సేవించిన తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రభు త్వ ఆదేశాలతోపాటు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ వాహన పత్రాలను కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. వాహన పత్రాలు లేనివారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులను సత్వరమే ఆదుకోవాలి

- ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

ఖమ్మం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మంజిల్లాలో వరదల్లో వేలాది ఎకరాల్లో రైతులు పంటలు మునిగిపోయి నష్టపోయారని, ఇసుక మేటలు వేసి భూములు కూడా కోల్పోయారని, వరద కారణంగా ఇళ్లల్లో నీరు చేరి బాధిత కుటుంబాలు సర్వం కోల్పోవడం జరిగింది, అయినప్పటికి ప్రభుత్వం ఇంకా బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం పంపిణీ చేయడంలేదని తక్షణం బాధితులను ఆదుకోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఛత్రపతి శివాజి విగ్రహావిష్కరణకు ఖమ్మం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఖమ్మం నగరంలో 10వేలపైగా కుటుంబాలు మున్నేరు వరద కారణంగా నష్టపోయాయన్నారు. ఇంకా చాలామంది వరద బాధితులకు నగదు సాయం అందలేదని, బ్యాంకు ఖాతాల్లో జమకాలేదని, వరదల్లో దెబ్బతిన్న ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిచాలని సూచించారు. అలాగే భారీవర్షాలు, వరదల కారణంగా జిల్లాలో పంట పొలాలు ఇసుకమేటలు వేశాయని, భూములు కోతకు గురయ్యాయని పంటలు కూడా దెబ్బతిన్నాయని, ఈ పొలాలను శుభ్రం చేయాలంటే ఎకరానికి రూ.25నుంచి రూ.40వేలు ఖర్చయ్యే పరిస్థితి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వలేదని తక్షణం రైతులకు పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాదులో హైడ్రాతో అందరు భయపడుతున్నారని రియల్ వ్యాపారంతోపాటు ఇతర వ్యాపారాలు రేవంత్‌రెడ్డి పాలనలో స్థంబించాయని రాష్ట్ర ఆదాయ వనరులు తగ్గుతున్నాయని ఆరోపించారు. పది నెలల కాలంలో రూ.45వేల కోట్లు పైగా అప్పు తీసుకున్నట్టుగా ఆర్థికశాఖ మంత్రి చెప్పారని గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులకు, వడ్డీలకు రూ.56వేల కోట్లు చెల్లించినట్టుగా ఆర్థికశాఖ మంత్రి చెప్పారని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం తగ్గిపోతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రియల్‌ఎస్టేట్ వ్యాపారంతో పాటు ఇతర వ్యాపారాలు దెబ్బతింటున్నాయని హైదరాబాదులో హైడ్రా అంటే అందరు భయపడే పరిస్థితి నెలకొందని, హైదరాబాదులో పెట్టుబడులు పెట్టాలంటే కూడా భయపడాల్సి వస్తుందని, ఈటల ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆరుగ్యారంటీలు, 66 హామీలు , 490 పనులకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని హామీలను తుంగలో తొక్కారని పేర్కొన్నారు.

రైతుల రూ.2లక్షల రుణమాఫీ 49లక్షల మంది రైతులకు రూ.34వేల కోట్లు మాఫీచేశామని ఒక వైపు చెబుతూనే మరోవైపు 21లక్షల మందికి రూ.17వేల కోట్లు రుణమాఫీ చేసామని చెబుతున్నారుని, అసలు రైతు రుణమాఫీ ఎంతమందికి అయిందన్నదానిపై స్పష్టత లేదని పేర్కొన్నారు. అలాగే రైతుబంధు గత ప్రభుత్వం కంటే మిన్నగా వేస్తామని ఎకరానికి రూ.15వేలు ఇస్తామని గొప్పలు చేప్పారని, కనీసం రూ.10వేలు కూడా ఇవ్వడం లేదని, అసలు రైతుబంధు ఇస్తారో కూడా లేదో స్పష్టత లేదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, బీజేపీ నాయకులు తాండ్ర వినోదరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సన్నె ఉదయ్‌ప్రతాప్, డాక్టర్ శీలం పాపారావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, బీజేపీ జిల్లా నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, అల్లిక అంజయ్య, శ్యామ్ రాథోడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ దసరా ఆదాయం రూ.25.94 కోట్లు


ఆర్టీసీ సిబ్బందితో ఆర్ఎం సరిరాం

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసర పండుగల సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఏడు డిపోల పరిధిలో అక్టోబర్ 1 నుంచి 11 వరకు, తిరిగి అక్టోబరు 13 నుంచి 16 వరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ఆదాయం రూ.24కోట్లు,94లక్షల,50వేలు వచ్చినట్లు రీజనల్ మేనేజర్ సరిరాం గురువారం తెలిపారు. అక్టోబరు 1 నుంచి 11 వరకు ఖమ్మం నుంచి హైద్రాబాద్‌కు, తిరుగు ప్రయాణంలో అక్టోబరు 13 నుంచి16 వరకు హైదరాబాద్ నుంచి ఖమ్మంకు ఏర్పాటు చేసిన 1210 ప్రత్యేక బస్సుల ద్వారా ఈ ఆదాయం సయకూరినట్లు ఆర్ఎం తెలిపారు. ఇందుకు కృషిచేసిన డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, డిఎంలు, ఆర్టీసీ అధికారులను, సిబ్బందిని గురువారం నగరంలోని నూతన బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్ఎం ప్రత్యేకంగా అభినందించారు. సంస్థకు ఆదాయం సమకూరటంలో ఆర్టీసీ పైస్థాయి అధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు విశేష కృషి వల్లనే ఈ ఆదాయం వచ్చిందని అన్నారు.

డిపోల వారిగి వచ్చిన ఆదాయం. భద్రాచలం రూ.4.71 కోట్లు, ఖమ్మం రూ.6.27 కోట్లు, కొత్తగూడెం రూ.2.87 కోట్లు, మధిర 3.11 కోట్లు, మణుగూరు రూ.3.62కోట్లు, సత్తుపల్లి రూ.4.59 కోట్లు, ఇల్లెందు రూ.74.32 లక్షలు ఆదాయం వచ్చింది.

ఉమ్మడి జిల్లా డిగ్రీ కళాశాలల క్రికెట్ పోటీలు షురూ


క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేయూ వర్శిటీ ఉమ్మడి జిల్లా అంతర డిగ్రీ కళాశాలల క్రికెట్ పోటీలు గురువారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభమైనాయి. పోటీలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 9 కళాశాలల జట్లు పాల్గొన్నాయి. గురువారం జరిగిన పోటీలలో విజయం సాధించిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుతో పాటు కేఎండీసీ, వికాస్, కొత్తగూడెం మైనింగ్ డిగ్రీ కళాశాల జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. శుక్రవారం తుది పోటీలు నిర్వహించనున్నారు. ఫైనల్స్ పోటీల అనంతరం ప్రతిభ చూపిన క్రీడాకారులను కేయూ వర్శిటీ అంతర జిల్లాల టోర్నీలో పాల్గొనే ఖమ్మం జట్టుకు ఎంపిక చేయనున్నారు. పోటీలను కాకతీయ యూనివర్శిటీ ఖమ్మం జోన్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి. వెంకన్న, పలువురు ఫిజికల్ డైరెక్టర్లు సమీక్షించారు.

కేంద్రమంత్రిని కలిసిన తుమ్మల యుగంధర్


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో యుగంధర్

ఖమ్మంటౌన్, అక్టోబరు 17 ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ గురువారం ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖమంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగూడెంలో విమానాశ్రయాన్ని త్వరగా నిర్మించాలని కేంద్రమంత్రిని యుగంధర్ కోరారు. వ్యవసాయ రంగానికి, ఆక్వా రంగానికి ఉపయోగపడే డ్రోన్‌లకు దేశంలో అనుమతులు ఇవ్వటం ద్వారా విమానయాన శాఖ సేవలను దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు విస్తరింప చేయాలని సూచించారు.

కేయూ దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్శిటి పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు కళాశాల అధ్యాయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. మొత్తం 43 కోర్సులకు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849250633 నెంబర్‌ను సంప్రదించాలనా తెలిపారు.

20న 'హాలికులు సేమమా' నాటిక ప్రదర్శన

ఖమ్మంసాంస్కృతికం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నెలనెల వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు హాలికులు సేమమా నాటికను ప్రదర్శించనున్నారు. జరుగుల రామారావు, కొమ్మాప్రసాద్ రచించిన ఈనాటికకు ప్రముఖ దర్శక, రచయిత నంది అవార్డు గ్రహీత దేవేంద్ర దర్శకత్వం వహించనున్నారు.

ప్రజా నాట్యమండలి ఖమ్మం జిల్లాకమిటీ ఆధ్వర్యంలో స్థానిక కళాకారులు నాటికను ప్రదర్శించనున్నారు.

రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు హార్వెస్ట్ విద్యార్థులు


విద్యార్థులతో హార్వెస్టు యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో నగరంలోని హార్వెస్ట్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. సెప్టెంబర్ 8న ఖమ్మంలో నిర్వహించిన ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. నవంబరు 3న జరగబోయే రీజినల్ పరీక్షకు పాఠశాల విద్యార్థులు టి. శ్రిజిత్, ఎస్ రుష్యేంద్రమణి, కె రుషిత్, సాయి అక్షిత్‌లు ఎంపికైనట్లు విద్యా సంస్థల కరస్పాండెంట్ రవి మారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లాల పాఠశాల అండర్-14
బాల, బాలికల టేబుల్ టెన్నీస్ ఎంపికలు

చుంచుపల్లి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్-14 బాల, బాలికల టేబుల్ టెన్నీస్ ఎంపికలు శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నారని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల విద్యాశాఖ అధికారులు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరచారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతూ 1-1-2010 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు వి.నరేష్‌కుమార్ -9951274678, నరసింహమూర్తి - 7989731339, సాంబమూర్తి- 9848408335, ప్రేమ్‌కుమార్-9949446551 పై నెంబర్లను సంప్రదించవచ్చునని ప్రకటించారు.

ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం

- మతిభ్రమించి మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్
- మాజీ ఎమ్మెల్సీలు బాలసాని, పోట్ల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమవిభాగం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ధ్వంసం చేస్తే 10నెలల కాంగ్రెస్ ప్రభుత్వం దానిని చక్కదిద్దుతుందన్నారు. కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్థిక విధ్వంసంనుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. డ్రగ్స్ కోసమే కేటీఆర్ అమెరికా పర్యటన చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం 11వేలమందికి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడం కేటీఆర్‌కు కనబడలేదా? అని ప్రశ్నించారు. అక్రమ కేసులు పెట్టిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎటువంటి దౌర్జన్యాలు, అక్రమ కేసులు లేవన్నారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మైనారిటీ విభాగం అధ్యక్షుడు ముజాహీద్ హుస్సేన్, ఎస్సీసెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రషీద్, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అండర్‌పాస్ హైలెవల్ వంతెన ఏదీ!?

- కుప్పకూలి పది నెలలైనా జాడలేని ఎన్‌హెచ్ అధికారులు
- జాతీయ రహదారి పనుల్లో నాణ్యతాలోపాలపై విస్మయం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఏడాదైనా పూర్తి కాని అండర్‌పాస్ హైలెవల్ వంతెన నిర్మాణం (ఇన్‌సెట్‌లో కుప్పకూలిన వంతెన దృశ్యం(ఫైల్)

వైరా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే అథారిటీ పర్యవేక్షణలో చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ హైలెవల్ వంతెన నాణ్యతాలోపంతో కుప్పకూలి పదినెలలైనా ఇంతవరకు తిరిగి నిర్మించలేదు. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు రాష్ట్రాలకు ఎంతో కీలకమైన వైరా-జగ్గయ్యపేట, మధిర రోడ్డులో సోమవరం సమీపంలో చేపట్టిన అండర్‌పాస్ హైలెవల్ వంతెన నిర్మాణం లోపభూయిష్టంగా చేపట్టడంతో ఈ ఏడాది జనవరి 18న కుప్పకూలింది. కాగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే కూలిన అండర్‌పాస్ హైలెవల్ వంతెనను తిరిగి నిర్మించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. నేషనల్ హైవే అథారిటీ నిర్మించే రోడ్లు, వంతెనలు ఇతరత్రా భవన నిర్మాణాలంటే చాలా నమ్మకం. ఎందుకంటే వారు చేపట్టే నిర్మాణాల్లో నాణ్యత విషయంలో రాజీపడరని, రేయింబవళ్లు క్షేత్రస్థాయిలోనే ఉండి పనులను పర్యవేక్షిస్తారని విశ్వాసం. కానీ ఈ అండర్‌పాస్ నాణ్యత విషయంలో అది వమ్ము అయింది.

కూలిన అండర్‌పాస్ హైలెవల్ వంతెన

నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో వేలకోట్ల రూపాయలతో ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు నాలుగులైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం సంబంధిత కాంట్రాక్టర్, సబ్‌కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా చేస్తున్నారనే విమర్శలున్నాయి. నేషనల్ హైవే అథారిటీకి చెందిన నిర్మాణాలు కావడంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఏమాత్రం ఖాతర్ చేయ డం లేదు. అయితే ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు నుంచి వైరా మండలంలోని సోమవరం వరకు ప్యాకేజీ-1 కింద 33.604కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని రూ.772.11కోట్లతో చేపట్టారు. 33వ కిలోమీటర్ వద్ద రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాలకు అత్యంత కీలకంగా ఉన్న వైరా నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని చిల్లకల్లు, జగ్గయ్యపేట అలాగే ఖమ్మంజిల్లాలోని మ ధిర వెళ్లే రహదారిలో సోమవరం వద్ద చేపట్టిన అండర్‌పాస్ హైలెవల్ వంతెన శ్లాబ్ నిర్మాణ దశలోనే జనవరి 18న కుప్పకూలిపోయింది. జరిగిన ప్రమాద తీరు తీవ్రంగా ఉన్నప్పటికీ ఎలాం టి ప్రాణహాని లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. 20అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న అండర్‌పాస్ హైలెవల్ వంతెనకు నాణ్యమైన సెంట్రింగ్ ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు భావించారు. ఈ ప్ర మాదంలో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. వారికి మొక్కుబడిగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించి చేతులు దులుపుకున్నారు.

ఇక్కడి నుంచే ఎగ్జిట్, సర్వీస్ రోడ్లు

ఈ అండర్‌పాస్ హైలెవల్ వంతెన దగ్గరి నుంచే ఎగ్జిట్ ప్రారంభమవుతుంది. సర్వీస్ రోడ్లు కూడా నిర్మిస్తున్నారు. చత్తీస్‌గఢ్, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఇక్కడి నుంచే వెళ్లాల్సి ఉంది. అలాగే చిల్లకల్లు, మధిర, జగ్గయ్యపేట తదితర ప్రాంతాల నుంచి ఏపీ, ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు గ్రీన్‌ఫీల్డ్ హైవేపైకి ఇక్కడి నుంచే రాకపోకలు కొనసాగించాల్సి ఉంది. అలాంటి కీలకమైన ఈ అండర్‌పాస్ హైలెవల్ వంతెన నాణ్యతలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే కుప్పకూలిందనే విమర్శలున్నాయి. అయితే కూలిన శ్లాబ్ శిథిలాలను రాత్రికి రాత్రే తొలగించిన అధికారులు శ్లాబ్ కోసం రోడ్డు మధ్యలో, రెండువైపులా చేపట్టిన కట్టడాలను తొలగించే విషయంలో పూర్తిగా చతికిలపడ్డారనే విమర్శలున్నాయి. కుప్పకూలిన దాన్ని వదిలేసి మరోవైపు అండర్‌పాస్ హైలెవల్ వంతెనను పూర్తిచేశారు. వాస్తవంగా గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరులోనే దీని నిర్మాణం మొదలు పెట్టినప్పటికీ జనవరిలో శ్లాబ్ దశలోనే కుప్పకూలిపోయింది.

ఈ రోడ్డులో ప్రతిరోజూ వేలాదిగా సిమెంట్, బొగ్గు, యాష్‌ట్యాంకర్లు, లారీలు తిరుగుతున్నాయి. అలాగే బస్సులు, కార్లు ఇతర వాహనాలు కూడా వేల సంఖ్యలోనే రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఈ వాహనాల రాకపోకల సమయంలో విపరీతమైన దుమ్ము లేచి ప్రయాణీకులను, పరిసరాల్లోని వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా కనీసం రోడ్డుపై వాటర్‌క్యూరింగ్ కూడా చేయడం లేదు. ఇప్పటికైనా ఈ జాప్యాన్ని నివారించి, త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసి ఇబ్బందులను తొలగించాలని ప్రయాణీకులు డిమాండ్ చేస్తున్నారు.

క్రైం సమాచారం

మధిర ఫారెస్ట్ కార్యాలయంలో చోరీకి యత్నం

మధిర/మధిరరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మధిర ఫారెస్ట్ ఆఫీసులో బుధవారం రాత్రి చోరీ యత్నం జరిగింది. ఫారెస్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మధిర విజయవాడరోడ్డులో ఉన్న ఫారెస్ట్ కార్యాలయానికి రోజు మాదిగానే సిబ్బంది బుధవారం తాళాలు వేసి వెళ్లారు. గురువారం ఉదయం పది గంటలకు బీట్ ఆఫీసర్ విజయకుమార్ తిరిగి ఆఫీసుకు రాగా గేటు తీసి ఉంది. ఆఫీసు గదుల తాళం పగులగొట్టి ఉన్నాయి. అన్ని గదులకు తాళాలు పగులగొట్టి బీరువాలను, లాకర్లను తెరిచి చూశాడు. అన్ని ఫైల్స్‌ను చిందర వందర చేశాడు. డబ్బుల కోసం ఎంత వెతికినా లేకపోవడంతో కిచెన్ గదితలుపు తీసుకొని వెళ్లిపోయాడు. ఈ సంఘటనలో ఆఫీసులో ఏమీ పోలేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఈ మేరకు బీట్ ఆఫీసర్ విజయ్‌కుమార్ టౌన్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సంధ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఖమ్మంక్రైం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలవలో గుర్తు తెలియని మృతదేహం గురువారం ఖమ్మం నగర పరిధిలో లభ్యమైంది. సుమారు 30 ఏళ్ల వయస్సున్న మృతదేహం గోపాలపురం సమీపంలనో ఎన్ఎస్‌పీ కెనాల్‌లో ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఖానాపురంహవేలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పరిశీలించి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి


నర్సయ్య(ఫైల్)

చింతకాని, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నామవరం గ్రామానికి చెందిన రెడ్డిబోయిన రాంబాబు(31) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంబాబుకు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో మూడేళ్ల క్రితం పెద్ద మనష్యుల సమక్షంలో విడిపోయారు. ప్రస్తుతం ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసైన రాంబాబు ఈ నెల 16న మద్యంలో క్రిమిసంహారక మందు కలిపి తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పేరువంచ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంచాల చిన్న నరసయ్య (65) గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పేరువంచ గ్రామంలో ఎన్టీఆర్ కాలనీ వద్ద ప్రధాన రహదారిపై బుధవారం కారు ఢీకొని జరిగిన రోడు ప్రమాదంలో ఎనిమిది మంది బాటసారులు గాయపడ్డారు. అందులో చిన్ననరసయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా పరిస్థితి విషమించి ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసుకొని ఎస్ఐ యస్‌కె షాకీర్ దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె....

బోనకల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామంలో గురువారం విద్యుధాఘాతంతో గేదె మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన నంబూరి వెంకటేశ్వర్లు గేదె పొలంలో మేతకు వెళ్లింది. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు తగలడంతో షార్ట్ సర్క్యూట్ తో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్ అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టేకులపల్లికి చెందిన చెల్లని చెక్కు కేసులో నిందితుడైన దురిశెట్టి వెంకన్నకు ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప ఆరు నెలలు జైలుశిక్షతో పాటు నిందితుడు ఫిర్యాదికి రూ.15లక్షలు చెల్లించాలని గురవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల వివరాల ప్రకారం.. ఖమ్మం నగరంలోని రాపర్తినగర్‌కు చెందిన ఫిర్యాది నూకరాపు అనిత వద్ద నిందితుడైన దురిశెట్టి వెంకన్న తన వ్యాపారం నిమిత్తం రూ.8లక్షలను రుణంగా 2016 సెప్టెంబరు 8న తీసుకొని అదే రోజు ప్రాంసరీనోటు రాసి ఇచ్చినాడు. ఫిర్యాది తన రుణాన్ని తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడు 2018 మార్చి5న రూ.10లక్షల చెక్కు జారీ చేసినాడు. ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా, నిందితుడి ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రయివేటు కేసు దాఖలు చేసినాడు. కేసు విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

పెరిగిన కోటమైసమ్మ తల్లి ఆలయ ఆదాయం


నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కారేపల్లి అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో జరుగుతున్న కోటమైసమ్మతల్లి జాతర సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన హుండీల లెక్కింపు కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈసందర్భంగా హుండీలలో గత ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా ఇప్పటివరకు రూ.7 వేల రూపాయలు వచ్చాయని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ డాక్టర్ పర్సాపట్టాబీ రామారావు తెలిపారు.

జాతర ఈనెల 21 వరకు పొడిగింపు

ఉసిరికాయలపల్లి గ్రామంలో బుధవారం వరకు జరిగి ముగిసిన కోటమైసమ్మ తల్లి జాతరను ఈనెల 21వరకు కొనసాగించనున్నట్లు చైర్మన్ పర్సాపట్టాబి రామారావు, ఈవో కె.వేణుగోపాలచార్యులు తెలిపారు. జాతర కొనసాగేందుకు మండల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారు సహరించాలన్నారు. తదుపరి అమ్మవారి ఆదాయానికి సంబందించిన వివరాలను 21న వెల్లడించనున్నట్లు వారు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈకార్యక్రమంలో దేవాదాయ ఖమ్మం జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎం.అనిల్‌కుమార్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధిరలో జాతీయ బాలోత్సవ్


జాతీయ మధిర బాలోత్సవ్-2024 పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మధిర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో నవంబర్ 15,16 తేదీలలో మధిరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి మధిర బాలోత్సవ్-2024పోటీల పోస్టర్లను గురువారం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, బాబ్లా మాట్లాడుతూ నవంబరు 15,16 వతేదీలలో 27వ జాతీయ బోలోత్సవ్ పోటీలను మధిర టుటౌన్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామివారి కళ్యాణమండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలి రోజు శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు, 16వతేదీన నీతి పద్యాలు, నీ సత్తా చాటుకో, ఏకపాత్రాభినయం, ఉపన్యాసాలు, దేశభక్తి గీతాలాపన, విచిత్ర వేషదారణ పోటీలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు తమ ఎంట్రీలను నవంబరు 10వ తేదీలోపు బాబ్లా, కార్యదర్శి బంజారా కాలనీ, మధిర అనే చిరునామాకు పంపాలని కోరారు. ఇతర వివరాలకు సెల్:9440675787 నందు సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈకార్యక్రమంలో కళ్యాణమండపం అధ్యక్షులు కల్యాణపు పుల్లారావు, నాగిరెడ్డి, గుండేల ముత్తయ్య, నర్సింహారావు, పసుపులేటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.



వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

సుజాతనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి జి.నర్మద అన్నారు. గురువారం మండలంలోని వరి పంటలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో ఈరోజు సందర్శించిన ప్రదేశాలలో వరి పంటలను పరిశీలించగా బాక్టీరియా ఆకు ఎండు తెగులును గమనించామని తెలిపారు. దీని వలన వరి మొక్క ఆకు చివరన వరి గడ్డి లాగా ఆకు ఎండిపోతుందని తెలిపారు. సుజాతనగర్ మండలంలోని కొన్ని చేలల్లో మాత్రమే ఈ బ్యాక్టీరియా ఆవహించిందని తెలిపారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా వరి వేసిన రైతుల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా..?

ప్రాణాంతకంగా మణుగూరు ప్రధాన రహదారి
పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు

మణుగూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలం నుంచి పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ వరకు గల ప్రధాన రహదారి ప్రాణాంతరకంగా మారింది. ఎప్పుడు ఎవరి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. మణుగూరు సీఎస్పీ దిగువ ప్రాంతం నుంచి రామానుజారం, సాంబాయిగూడెం, దమ్మక్కపేట బీటీపీఎస్ వరకు ఉన్న ప్రధాన రహదారి అయిన బీటీ రోడ్డు అడుగడుగునా గుంతల మయంగా మారింది. ఎప్పుడు గుంతలు బొగ్గు, ఇసుక లారీల రాకపోకల వల్ల మరింత విస్తరించి పొంచి ఉన్న ప్రమాదాలకు సంకేతాలుగా మారాయి. ఈ రహదారి ఇంత అధ్వాన స్థితిలో ఉన్న పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ప్రజలు ఈ విషయంపై పత్రి



గుంతలమయంగా ఉన్న రహదారి

కా ముఖంగా ఆర్‌అండ్‌బీ, ప్రజా ప్రతినిధులకు వినతులు చేసినా నిద్రావస్థలో ఉన్న అధికారులు ప్రతినిధులకు అవేమి పట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డంతా చిద్రమై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రతి వాహన చోదకుడికి అగ్ని పరీక్షలను పెడుతున్నాయి. ఎప్పుడు ఏ వాహనం ఢీకొంటుందో ఎప్పుడు ఏ వాహనం రోడ్డునుంచి మరలి పక్కన ఉన్న పోలాల్లోకి పడిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. రాత్రి వేళ ఈ రహదారి వెంట ప్రయాణాలు గమ్యస్థానాలు చేరుకునేంత వరకు మనిషి ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వలేని పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కాలంలో మణుగూరుకు చెందిన వెల్డర్ రవి ద్విచక్ర వాహనంపై పినపాక మండలం జానంపేట నుంచి మణుగూరు వైపుకు వస్తూ ఇసుక బంకర్ వద్ద గుంతలో వాహనం పడిపోయి మృతి చెందాడు. అత్యంత ప్రమాదకరంగా ప్రాణాలను హరించి వేస్తున్న ప్రదాన రహదారిపై ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు దృష్టి సారించకపోతే మరెన్నో దుస్సంఘటనలకు ఆస్కారం ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్స్, ఆయాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అప్‌గ్రేడ్ అయిన మినీ టీచర్స్‌కు పూర్తి వేతనం ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గురువారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ అధికారులకు అందించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మినీ టీచర్స్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ పూర్తి వేతనం ఇవ్వకుండా పాత పద్దతిలోనే వేతనాలు ఇవ్వటం దారుణమన్నారు. 10 నెలలు గడుస్తున్నా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు ఏవీ పరిష్కారం కావటంలేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అర్జున్, నాయకులు రాధా, కృష్ణవేణి, రాజేశ్వరి, లక్ష్మీ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు టౌన్: మినీ అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ ప్రాజెక్టు అధికారులు అంగన్‌వాడీల పరిస్థితులపై స్పందించాలని డిమాండ్ చేశారు. గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడంలో తీవ్రజాప్యం చేస్తున్నారని వేతనాలు అందక మినీ అంగన్‌వాడీలు పెరిగిన వేతనాలు ఎప్పుడు అందుతాయోనని కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించినప్పటికీ వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. పూర్తిస్థాయి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మరియా, ఫాతిమా, సుజాత, వెంకటమ్మ, శ్రీలత, కుమారి, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

జూలూరుపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగన్న పాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పంచామృతాలతో సాయిబాబాకు అభిషేకాలు చేశారు. ఆలయ కమిటి చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ

జూలూరుపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారిగా బి.జుంకీలాల్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా టీటీఎఫ్ నాయకులు, సిబ్బంది స్థానిక ఎమ్మార్సీలో ఆయనకు శాలువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయం పాటించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

కార్పొరేషన్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

సుజాతనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ పంచాయతీని కార్పొరేషన్ చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ అన్నారు. గురువారం సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుజాతనగర్ పంచాయతీని కార్పొరేషన్ చేయాలని ప్రతిపాదన సరైంది కాదనిన్నారు.

బస్టాండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

పినపాక, అక్టోబరు 17: గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి గ్రామస్థుల సహకారంతో మండలంలోని జానంపేట గ్రామంలో నిర్మించిన నూతన బస్టాండ్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ ఊరి ప్రజల కోసం ఓ బృహత్తర కార్యక్రమాన్ని ఎంచుకుని, సమష్టిగా నిర్మాణం పూర్తి చేసుకుని, ప్రారంభోత్సవం చేసుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు తమ గ్రామంలో నిర్మించుకున్న బస్టాండ్‌లో అన్ని బస్ సర్వీస్‌లను నిలుపుదల చేసేలా, ఆర్టీసీ ఆన్‌లైన్ బుకింగ్‌లో జానంపేట బస్టాండ్‌ను రిజర్వేషన్‌లో చూపేలా చర్యలు తీసుకోవాలని కోరగా, తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే పాయం, మణుగూరు డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జానంపేట రైతులు, ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అక్కడే ఉన్న పలు శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని పేర్కొన్నారు. జానం పేట గ్రామానికి చెందిన ఆవుల



బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న పాయం

రంగారావు దశ దిన కర్మలకు హాజరై, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఏడూళ్లబయ్యారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బండ్ల లక్ష్మి దశదిన కర్మలకు హాజరై, శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించారు. టేకులపల్లి కాంగ్రెస్ నాయకుడు బండ్ల శ్రీనివాస్‌ను పరా మర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పిన పాక తహశీల్దార్ ఏ. నరేష్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీవో వెంక టేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొడిశాల రామనాధం, యూత్ కాం గ్రెస్ ఉపాధ్యక్షుడు కొర్సా అనంద్, సీనియర్ కాం గ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు, వి.లక్ష్మీరెడ్డి, రాజేష్, శ్రీనివాస రెడ్డి, సాంబశివరావు, మల్లయ్య, కిషోర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆలయాలకు తాళం.. భక్తుల ఆక్షేపణ

భద్రాచలం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయ స్వామి, లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయాల గ్రిల్స్‌కు తాళాలు వేసి ఉండటం పట్ల భక్తుల నుంచి ఆక్షేపణలు వ్యక్తం అవుతున్నాయి. అదేవిధంగా కనీసం తీర్థం, ప్రసాదం పంపిణీ చేసే వ్యవస్థ కూడా నిలిచిపోవడం పట్ల భక్తులు ఆవేదన చెందుతున్నారు. గురువారం శబరి స్మృతి యాత్ర నిర్వహిస్తున్న సమయంలో ఆలయానికి భక్తుల రాక అధికంగా ఉండే అవకాశం ఉన్నా వైదిక సిబ్బంది ఆ రెండు ఆలయాల గ్రిల్స్ కు తాళాలు వేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ఫోటోలతో ప్రచారం సాగడం గమనించదగ్గ విషయం. అయినా వైదిక సిబ్బంది ఏ మాత్రం ఈ విషయం పరిగణలోకి తీసుకోకపోవడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అశ్వారావుపేట మండలం వినాయకపురంలో శబరి స్మృతి యాత్ర నిర్వహించిన అనంతరం భద్రాచలం వచ్చిన ఈవో ఎల్ రమాదేవి సాయంత్రం నుంచి సుమారు రెండు గంటలకు పైగా వైదిక పరిపాలన సిబ్బందితో అత్యంత అత్యవసర సమావేశాన్ని



అమ్మవారి ఆలయానికి తాళం..

నిర్వహించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ సమయంలో వైదిక సిబ్బందిలో కొంతమంది వ్యవహరిస్తున్న తీరు పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వినికిడి. ఈ సమావేశం వాడి వేడిగా సాగినట్లు తెలుస్తోంది. కాగా వైదిక సిబ్బంది కొరత క్రమంలోనే ఈ సమస్య తలెత్తిందని ప్రచారం వేదిక వర్గాల్లో వినిపిస్తోంది. అయితే కొరత ఉన్నా సర్దుబాటు చర్యలు చేప డితే సముచితంగా ఉండేదని భక్తులు పేర్కొం టున్నారు. ఇప్పటికే దేవస్థానం ఆధ్వర్యంలో ని ర్వహిస్తున్న పలు వైదిక కార్యక్రమాల నిర్వహణ సమయాల్లో మార్పులు చేర్పులు చోటు చేసు కుంటుండడం విమర్శలకు తావిస్తోంది. ఈవో ఆదేశాలను సైతం కొంతమంది కీలక వైదిక సి బ్బంది బేఖాతర్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

‘ఎల్‌ఆర్‌ఎస్’లను పరిష్కరించాలి

కొత్తగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ స్థాయిలో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తమ పరిధిలోకి వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను రోజుకు కనీసం 10 దరఖాస్తులు పూర్తి చేసేలా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో ప్రభుత్వ భూమి, కోర్టు కేసులు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా..? అనే విషయాన్ని తప్పని సరిగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి భూమి వివరాలు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి ఎలాంటి పొరపాట్లు జరగకుండ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

వణికిస్తున్న పోస్ట్ వైరల్ ఫీవర్స్

(5వ పేజీ తరువాయి)

ప్రధాన లక్షణాలుగా ఉన్నాయి. ముఖ్యంగా కండరాలు, ఎముకల నొప్పులు తీవ్రంగా ఉంటాయి. జ్వరం సోకిన వారిలో రోగ నిరోధక శక్తి మెరుగ్గా ఉంటే ఇవి తగ్గేందుకు వారం రోజులు పడుతుం ది. రోగనిరోదక శక్తి సరిగా లేనివారికి మాత్రం ఆరు వారాల వర కు సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. మణుగూరు ఏరియా ఆసుపత్రికి పిన పాక ఏజెన్సీతో పాటు ములుగు జిల్లా నుంచీ జ్వర బాధితులు వచ్చి చికిత్స పొందుతున్నారు. అనేకమం ది పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ చికిత్స పొందుతున్నారు.

ఖర్చుతో కూడుకున్న వైద్యం

రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఇలాంటి కొత్త జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జ్వరాన్ని తగ్గించుకునేందుకు ఎక్కడి వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం జ్వరం వస్తే రెండు నుంచి మూడు వేలకు వరకు ఖర్చవుతోంది. మలేరియా, తదితర జ్వరాల నిర్ధార్ణ పరీక్షలకు సుమారు రూ.600 వరకు ఖర్చవుతోంది. ఆ తర్వాత మందులు, ఇతర ఆసుపత్రి చార్జీలు కలుపు కొని వేలాది రూపాయాలు చెల్లించాల్సి వస్తోందని కొందరు బాధితులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మణుగూరు వైద్యాధికారి డి. శివకుమార్‌ను వివరణ కోరగా ఈ విధమైన కేసులు రోజుకు 20 వరకు వస్తున్నాయని, రక్త నమూనాలు సేకరించి కొత్తగూడెం పంపిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మురుగు నీటి కాలువలు శుభ్రంగా లేకపోవడం, దోమకాటు వల్ల ఇలాంటి జ్వరాలు వస్తాయన్నారు. ఇలాంటి జ్వర బాధితులు పూర్తిగా కోలుకునేందుకు ఆరు వారాల నుంచి ఆరు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

ఫొటోగ్రఫీ పోటీలకు ఆహ్వానం

కొత్తగూడెం, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే)ను పురస్కరించుకుని జిల్లా పరిధిలో గల ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోలీస్ అమర వీరుల ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ 21న సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించబడతాయని, ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు. అమరుల త్యాగాలను గుర్తు చేసుకోవాలన్నారు.

కొమరం భీంకు నివాళులు

మణుగూరు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మన్యం వీరుడు ఆదివాసీ హక్కుల కోసం నైజాం నవాబును ఎదురించి పోరాడిన కొమరం భీం 84 వర్ధంతిని గురువారం ఆదివాసీ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లోని కోమరం భీం విగ్రహానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆదివాసీ జాతి కోసం వారి హక్కుల సాధన కోసం చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో కూచిపూడి బాబు, నవీన్, శివ, సామా శ్రీనివసరెడ్డి, ఆవుల సర్వేశ్వరరావు ఆదివాసీ నాయకులు వర్సా శ్రీను, చందా సంతోష్, కాటిబోయిన నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

పినపాకలో..

పినపాక: ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీం వర్ధంతిని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై, ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్, జానంపేట గ్రామంలోని కొమరం భీమ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. ఆదివాసీల ఆరాధ్య దైవంగా, ఆనాటి అరాచక పాలనను వ్యతిరేకించి జల్, జంగిల్, జమీన్ అనే నినాదంతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన ధీశాలి కొమరం భీమ్ అని, ఆయన గొప్పతనం, సిద్ధాంతాలు ఆచరణీయని, వారి స్ఫూర్తితో నడిచి ఆదివాసీలు అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఆదివాసీ అభ్యుదయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గలి రామకృష్ణ, ఆదివాసీ సంఘం నాయకులు కొమరం శ్రీను, కొర్సా ఆనంద్, తోలెం శ్రీను, కుర్సం సారయ్య, ధనసరి మూర్తి దొర, సోలం అశోక్, అర్జున్, వినయ్, భరత్, తహశీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఎస్సై రాజ్‌కుమార్, ఏపీవో వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయండి: జారే

దమ్మపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట నియోజకవర్గంలోని గిరిజన యువకులకు ఉపాధికల్పనకు రుణాలు మంజూరు చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ట్రైకార్ చైర్మన్ బెల్లా నాయక్‌ను కోరారు. ట్రైకార్ చైర్మన్‌ను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆయన కార్యాలయంలో గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం, గిరిజన యువకులకు ఉపాధి శిక్షణ, చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం తదితర అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు. చైర్మన్ బెల్లా నాయక్ మాట్లాడుతూ యువతకు ఉపాది, శిక్షణకు నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో ఎర్రగొర్ల రాధాకృష్ణ, రావు రవిశంకర్, వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

న్యాయమూర్తికి సత్కారం

దమ్మపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దమ్మపేట కోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బత్తుల రామారావు కొత్తగూడెం సీనియర్ కోర్టుకు బదిలి అయ్యారు. ఈసందర్భంగా దమ్మపేట కోర్టు వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రామారావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతు న్యాయమూర్తిగా తక్కువ కాలం విధుల నిర్వహించినా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించారని అన్నారు. న్యాయమూర్తి రామారావు మాట్లాడుతూ తనకు సహకరించిన న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, కక్షిదారులకు ధన్యవాదాలు తెలిపారు.